క్లుప్తంగా

రేపు విస్తృత స్థాయి సమావేశం

జడ్చర్ల: జడ్చర్ల నియోజకవర్గ విస్తృత స్థాయి కాంగ్రెస్ పార్టీ సమావేశాన్ని ఈనెల 17న జడ్చర్లలోని చంద్రగార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఎంపికకు సంబంధించి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పార్టీ అధిష్టానం ఈ సమావేశాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. మొదటగా బ్లాక్ ఏ పరిధిలోని జడ్చర్ల, మిడ్జిల్, ఊర్కొండ మండలాల పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజనం అనంతరం బ్లాక్ బిలోని నవాబుపేట, రాజాపూర్, బాలానగర్ మండలాల సమావేశం ఉంటుందని తెలిపారు. సమావేశాన్ని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

3, 17వార్డుల్లో పర్యటించిన చైర్ పర్సన్

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీ పరిధిలోని 3, 17వ వార్డుల్లో చైర్‌పర్సన్ కోనేటి పుష్పలత బుధవారం పర్యటించారు. వార్డుల్లో అవసమరైన సీసీరోడ్డు, మురికి కాల్వలకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేయించేందుకు పర్యటించినట్లు చైర్‌పర్సన్ తెలిపారు. ఆమె వెంట వార్డు కౌన్సిలర్లు సతీష్, చైతన్య, నాయకులు అనుపకృష్ణ, ఎర్ర ఆనంద్, అంజిరెడ్డిలు ఉన్నారు.

చిన్నారులకు స్వర్ణామృత ప్రాశన ఔషధం



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం న్యూటౌన్‌లోని అప్పే స్మారక సమితి పాలమూరు ఆధ్వర్యంలో బుధవారం 16 ఏళ్లలోపు చిన్నారులకు ఉచితంగా స్వర్ణామృత ప్రాశన ఔషధం (చుక్కల మందు) వేశారు. 120 మంది చిన్నారులకు ఔషధ వితరణ చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాజేశ్వర్‌రెడ్డి, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ జిల్లా సంఘచాలక్ వసంతం వెంకటేశ్వర్లు, విభాగ్ సంఘచాలక్ దేవేందర్ రాజు, సమితి సభ్యులు బలరాం, బాల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌హెచ్‌జీల యూనిట్లు పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పీయూ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ ముఖ్య అతిథిగా హాజరుకానున్నందున కలెక్టరేట్ ప్రాంగణంలో మెప్మా ఆధ్వర్యంలో స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. ఇందులో భాగంగా బుధవారం ప్రాజెక్టు డైరెక్టర్ మహమ్మద్ యూసుఫ్ స్థానిక బాయమ్మతోటలో తినుబండారాల యూనిట్‌ను పరిశీలించారు. దీనిని ఎస్‌హెచ్‌జీ మహిళ హసినా కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. అలాగే బీకేరెడ్డి కాలనీలోని నాగజ్యోతి నిర్వహిస్తున్న జ్యూట్, ప్లాంటేషన్ యూనిట్లను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డీఎంసీ ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి దూరంగా ఉండాలి

జడ్చర్ల టౌన్: మద్యపానం, ధూమపానానికి దూరంగా ఉండటం వల్ల ఆరోగ్యంగా ఉంటామని గంగాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.ప్రతాప్‌చౌహాన్ అవగాహన కల్పించారు. మండలంలోని గంగాపురంలో డా.బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ 1, 4 యూనిట్లు వలంటీర్ల శీతాకాల శిబిరంలో భాగంగా బుధవారం జెడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. శిబిరంలో భాగంగా వలంటీర్లు బృందాలుగా ఏర్పడి గ్రామస్తులకు సైబర్‌నేరాలపై అవగాహన కల్పించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

మహమ్మదాబాద్: ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా గద్వాల, ధరూర్‌లో నిర్వహించిన అండర్–14 బాలికల జట్టు నుంచి మహమ్మదాబాద్ మండలం నంచర్లకు చెందిన సీ చందన రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికైంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి ఉత్తమ ప్రతిభ కనబర్చింది. దీంతో ఉమ్మడి జిల్లా నుంచి చందనను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. దీంతో ఆమె ఈనెల 16నుంచి 18 వరకు పటాన్‌చెరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు క్రీడా ఉపాధ్యాయులు అబ్దుల్లా తెలిపారు.

వాలీబాల్ పోటీల పరిశీలకుడిగా ముస్తఫా

మహబూబ్‌నగర్ క్రీడలు: సంగారెడ్డిలో గురువారం నుంచి 18వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి అండర్–17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ పోటీల్లో బాలుర విభాగానికి పరిశీలకుడిగా జిల్లా కేంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాల న్యూటౌన్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సయ్యద్ ముస్తఫా నియామకం అయ్యారు. ఈ మేరకు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

నేడు పరిశీలకుల రాక

దేవరకద్ర: నియోజకవర్గ కేంద్రంలో ని శ్రీనివాస గార్డెన్స్‌లో గురువారం ఉదయం 11 గంటలకు దేవరకద్ర, చిన్నచింతకుంట, కొత్తకోట మండలాల సమన్వయ కమిటీల సమావేశానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి హాజరు కానున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి తెలిపారు.

బురద రోడ్డుపై బేజారు!



బండకుచ్చెతండాకు వెళ్లే రోడ్డు దుస్థితి

- గుంతలుగా బండకుచ్చతండా దారి
- నిత్యం వాహనదారుల ఇబ్బందులు

మహమ్మదాబాద్: ఎన్నో ప్రభుత్వాలు మారుతున్నా పాలకులు నాయకులు మారినా మారుమూల గిరిజన తండాల్లో నివాసాల రోడ్లు అభివృద్ధిలో మాత్రం మార్పు లేదనడానికి నిండు నిదర్శనం ఈరోడ్డు. మహమ్మదాబాద్ మండలంలోని గాధిర్యాల్ అనుబంధ జీపీ అయిన ఆముదాలగడ్డతండా ఆమ్లేట్ విలేజ్ బండకుచ్చతండా, బొట్లగడ్డ తండాల పరిస్థితి రోడ్డును చూస్తేనే అభివృద్ధి ఎంతో అర్థమవుతుందని ఆయా గ్రామాల ప్రజలు తెల్పుతున్నారు. ఆముదాలగడ్డ తండాకు కిలోమీటరున్నర దూరం ఉన్న బండకుచ్చె తండాలో ఎంతో పేరు ప్రఖ్యాతులు గాంచిన వేంకటేశ్వర స్వామి ఆలయం ఉంది. 5 ఏళ్ల క్రితం నిర్మాణం పూర్తి చేసిన ముంబయి వెంకిసంస్థ వారు అన్ని ఏర్పాట్లతో కూడిన ఆలయాన్ని ఏర్పాటు చేశారు. దీంతో నిత్య పూజలు కైంకర్యాలు కూడా నిర్వహిస్తారు. టీటీడీకి చెందిన బ్రాహ్మణులను సహితం ఏర్పాటు చేసి వారికి అన్ని సౌకర్యాలు కల్పించడంతో నిత్యం వచ్చే భక్తుల పెరిగింది. దీంతో ఆ రోడ్డు గుండా నిత్యం వందలాది వాహనాలు తిరుగుతున్నాయి. కురిసిన వార్షాలకు రోడ్డు బురదమయంగా మారి వాహనాలు వెళ్లడానికి భక్తులు, తండా వాసులు నానా అవస్థలు పడుతున్నారు. బురదలో రోడ్డుపక్కకు వాహనాలు వెళ్లి ఎంతో ప్రమాదాల బారిన పడుతున్నాయి.

నిత్యం అవస్థలు



అన్ని ఏర్పాట్లతో చిన్నపాటి కొండపై నిర్మించిన వేంకటేశ్వరస్వామి ఆలయం నాలుగైదేళ్లలో ఎంతో ప్రసిద్ధిపొందింది. దీంతో నిత్యం ఎంతో దూరం నుంచి భక్తులు మహిళా భక్తులు అధికంగా వస్తారు. రోడ్డు సౌకర్యం మంచిగా లేకపోవడంతో నిత్యం నానా అవస్థలు పడుతున్నారు.

– లోక్‌రాంనాయక్, బండకుచ్చతండా

రోడ్డు నిర్మించాలని పలుమార్లు తెలిపాం..



రెండు తాండాలతో బాటు ప్రసిద్ధి గాంచిన వెంకటేశ్వర స్వామి ఆలయం ఉన్న దని నిత్యం వందలాది భక్తు లు ఎంతో దూరం నుండి వస్తున్నారని రోడ్డు సౌక ర్యం మంచిగా ఏర్పాటు చేయాలని పలుమార్లు నాయకులకు అధికారులకు తెల్పినా ఫలితం లేదు. మారుమూల గిరిజన తాండాలనైనా దృష్టిలో పెట్టుకుని రోడ్డుసౌకర్యం ఏర్పాటు చేయాలి.

– రాంచందర్, యూత్‌లీడర్, బండకుచ్చతండా

ఎట్టకేలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్



రిటైర్డ్ ఉపాధ్యాయుడు కొండయ్య ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న అధికారులు

గండేడ్: మండలం కొంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రిటైర్మెంట్ ఉపాధ్యాయుడు కుడుముల కొండయ్యకు బుధవారం సాయంత్రం రూ.9లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ప్రభుత్వం అందించినట్లు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి తెలిపారు. రిటైడ్ అయిన కొండయ్య కొన్ని రోజులుగా తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలైన సంఘటన విధితమే. ఆయనకు పదవీవిరమణ సమయంలో రిటైడ్ మెంట్ బెనిఫిట్స్ రాకపోవడంతో ఆస్పత్రి చికిత్సకు తీవ్ర ఇబ్బందులైన సంఘటన పలు పత్రికల్లో రావడం దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డీఓ, కలెక్టర్ స్పందించి బుధవారం సాయంత్రానికే రూ.9లక్షలు ఆయన ఖాతాలో జమచేసినట్లు ఆయన తెలిపారు. మిగతా డబ్బులు కూడా త్వరలో ప్రభుత్వం విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఉపాధ్యాయులు ఉద్యోగుల పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నట్టు ఆయన తెలిపారు. ఎలాంటి అపోహలకు తావియొద్దని సూచించారు.

- అనారోగ్యంతో బాధపడుతున్న రిటైర్డ్ ఉపాధ్యాయుడు కొండయ్యను అధికారులు ఆస్పత్రికి తరలించారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరాడు. అతనికి రావాల్సిన బెనిఫిట్స్ రాకపోవడంతో చికిత్స డబ్బులు పెట్టే స్థోమత లేక ఇంటికి వచ్చేశారు. విషయం తెలుసుకున్న ఆర్డీఓ నవీన్‌కుమార్, డీఈఓ ప్రవీణ్, డీహెచ్‌ఓ పద్మజ స్థానిక తహసీల్దార్ మల్లికార్జున్ రావులు కొంరెడ్డిపల్లి గ్రామానికి వెళ్లి కొండయ్య ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.
- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలంటూ ఉపాధ్యాయులు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. గండేడ్, మహమ్మదాబాద్ మండలాల ఉపాధ్యాయులు సామూహికంగా వెళ్లి గండేడ్ ఎంపీడీఓ హరిశ్చంద్రారెడ్డికి, ఎంఈఓ జనార్దన్‌కు రిటైడ్‌మెంట్ బెనిఫిట్స్ తక్షణమే చెల్లించేలా చూడాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత



దేవరకద్ర: మండలంలోని కోయిల్‌సాగర్ గ్రామంలో కావలి సంజమ్మ, ఆడవి అజిలాపూర్ గ్రామంలో వడ్డె హనుమమ్మలు మృతి చెందడంతో రెండు కుటుంబాలకు జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్ కోనరాజశేఖర్ బుధవారం ఆర్థికసాయం అందజేశారు. ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున రెండు కుటుంబాలకు రూ.10 వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాజుగౌడ్, నాగిరెడ్డి, కథలయ్య, మాధవులు, రాజు, శ్రీను, లక్ష్మణ్, సూర్యం పాల్గొన్నారు.

రాజస్థాన్‌లో ఉపాధ్యాయురాలి ప్రదర్శన



గండేడ్: రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నిర్వహిస్తున్న సెంటర్ ఫర్ కల్చరల్ అండ్ రీసెర్చ్ అండ్ ట్రెయినింగ్‌కు గండేడ్‌కు చెందిన ఉపాధ్యాయురాలు ఎంపికైంది. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన బయో సైన్స్ ఉపాధ్యాయురాలు సాటిక సుజాత కన్జర్వేటర్ ఆఫ్ నేచురల్ కల్చర్ హెరిటేజ్, పర్యావరణ, చారిత్రక కట్టడాల పరిరక్షణ మీద నిర్వహిస్తున్న శిక్షణకు ఆమె వెళ్లారు. అక్కడ క్షేత్ర పర్యటనతో పాటు రాష్ట్రానికి చెందిన బోనాల పండుగ, బతుకమ్మ పండుగ నిర్మాణ కళారూప ప్రదర్శనను బుధవారం సీసీ ఆర్టీ ఉదయ్‌పూర్‌లో ప్రదర్శించారు. తెలంగాణ రాష్ట్రం తరపున మొత్తం ఏడుగురు ఉపాధ్యాయుల బృందం ప్రదర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి సుజాత, వికారాబాద్ జిల్లా నుంచి శివరాజు, నిజామాబాద్ నుంచి కుమారస్వామి, రమేష్, సుజాత, సోహన్‌లాల్, సంతోష్‌లు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.

క్షిపణి పితామహుడు అబ్దుల్‌కలాం

మహమ్మదాబాద్: క్షిపణి పితామహుడు మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాంను ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎంపీపీ శాంతీబాయి తెలిపారు. అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశ రక్షణకోసం ఆయన సైంటిస్టుగా ఎన్నో క్షిపణులను కనిపెట్టిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. రాష్ట్రపతిగా ఉంటూ ఎన్నో దేశాలతో సత్సంబంధాలను కొనసాగిస్తూ దేశ రక్షణలో త్రివిధ దళాలను ప్రథమస్థాయిలో నడిపించిన ఘనత ఆయనదే అన్నారు. అలాంటి నాయకుడి అడుగుజాడల్లో యువత నడవాలని, ఆయన కలలుగన్న దేశాన్ని తయారు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు రాంలాల్, రహీం, అనంతయ్యగుప్త, విష్ణు, రాజేశ్వర్, వేణుగౌడ్, శివ, చెన్నప్ప పాల్గొన్నారు.

ఘనంగా మాజీ రాష్ట్రపతి జయంతి

భూత్పూర్: మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఘనంగా నిర్వహించారు. అమిస్తాపూర్‌లో మాజీ రాష్ట్రపతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో మహ్మద్ సాదిక్, జహంగీర్ బాబా, మహ్మద్ షాకీర్, ఫెరోజ్, ఖాసీం, భాస్కర్ సద్దాం, ఆమెర్, జునేద్ ఉన్నారు.



అబ్దుల్‌కలాం విగ్రహానికి నివాళులర్పిస్తున్న వెంకట్‌రెడ్డి, అధ్యాపకులు

వాగ్దేవీ కళాశాల ఆధ్వర్యంలో అబ్దుల్‌కలాం జయంతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని వాగ్దేవీ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో న్యూటౌన్‌లోని కలాం విగ్రహం వద్ద ఘనంగా జయంతి నిర్వహించారు. ఈ మేరకు కార్యక్రమంలో కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ దేశ సేవ కోసం తపించి, యువత అభ్యున్నతి కోసం పాటుపడిన వ్యక్తి అబ్దుల్‌కలాం అని, ఆయన జీవితం మొత్తం దేశానికే అంకితం ఇచ్చి నేటితరం యువతకు ఆదర్శంగా నిలిచారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గీతాదేవి, ఐఐటీ, నీట్ ఇన్‌చార్జి పావని, వైస్ ప్రిన్సిపాల్ జ్యోతి, నందన్‌రెడ్డి, షాకీర్, రాఘవేందర్, కోట్ల శివకుమార్, నాగేందర్, రాఘవేందర్ పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని టీపీసీసీ కోఆర్డినేటర్, టీజీఎస్ ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా గౌరవాధ్యక్షులు ధార భాస్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలో టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఉమ్మడి జిల్లా నూతన గౌరవాధ్యక్షుడిగా ధార భాస్కర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం దార భాస్కర్‌ను సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో టీజీఎస్‌ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి (రీజినల్) దార సుందర్, నాయకులు చంద్రయ్య, నర్సింహ్మా, కృష్ణ నాయక్, వెంకటయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.



ధార భాస్కర్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

వాలీబాల్ పోటీలకు అకాడమీ విద్యార్థులు

మహబూబ్‌నగర్ క్రీడలు: సంగారెడ్డిలో గురువారం నుంచి ఈనెల 18 వరకు జరిగే రాష్ట్రస్థాయి అండర్–17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ పోటీలకు జిల్లా కేంద్రం డీఎస్ఏ స్టేడియంలోని వాలీబాల్ అకాడమీ క్రీడాకారులు ఎంపికయ్యారు. చందు, ప్రశాంత్ ఉమ్మడి జిల్లా బాలుర వాలీబాల్ జట్టులో చోటు దక్కించుకున్నారు. వారిని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అభినందించారు. రాష్ట్రస్థాయి టోర్నీలో మెరుగైన ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వాలీబాల్ కోచ్ పర్వేజ్‌పాష పాల్గొన్నారు.



ఉత్సాహంగా అండర్-17 కబడ్డీ టోర్నీ

మహబూబ్‌నగర్ క్రీడలు: కేంద్రంలోని మెయిన్ స్టేడియంలో బుధవారం జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్–17 విభాగం బాల, బాలికల కబడ్డీ టోర్నీ కమ్ సెలక్షన్స్ నిర్వహించారు. క్రీడలను ఎంఈఓ లక్ష్మణ్ నాయక్, జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ శారదాబాయి ప్రారంభించారు. ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీల్లో విద్యార్థులు ప్రతిభచాటాలని కోరారు. కార్యక్రమంలో పీడీ, పీఈటీల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నిరంజన్, పెటాటీఎస్ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌గౌడ్, పీడీలు వేణుగోపాల్, వడెన్న, రాంచందర్ పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేతలు

అండర్–17 కబడ్డీ టోర్నమెంట్ సెలక్షన్స్ ఆయా మండలాల జట్లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. బాలుర విభాగంలో మహబూబ్‌నగర్ అర్బన్ జట్టు ప్రథమ, నవాబ్‌పేట ద్వితీయ, బాలికల విభాగంలో మహబూబ్‌నగర్ రూరల్ జట్టు ప్రథమ, కోయిలకొండ ద్వితీయ స్థానాల్లో నిలిచాయి.

ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేయాలి

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లాలో ధాన్యం కొనుగోలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్లో అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు. రైతులు ఎక్కడా నిరీక్షించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం కొనుగుళ్లలో మిల్లర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. అంతకుముందు ధాన్యం కొనుగోలుపై రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హైదరాబాద్ నుంచి వీసీ నిర్వహించారు. ధాన్యం కొనుగోలుపై కలెక్టర్ సూచనలు, సలహాలు ఇచ్చారు. మౌలిక సదుపాయాల కల్పన అంశంలో అత్యవసరం అనుకుంటే అదనపు ఖర్చులకు వెనకాడ వద్దని తెలిపారు. నమోదైన కొనుగోళ్లకు 48 గంటల్లో చెల్లింపులు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ నాయక్, డీఆర్డీఓ నర్సింహులు, జిల్లా పౌర సరఫరా శాఖ అధికారి శ్రీనివాస్, డీఎం రవి నాయక్, వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్, డీసీఓ శంకరాచారి, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

కపాస్ కిసాన్ మొబైల్ యాప్‌పై రైతులకు అవగాహన

పత్తి కొనుగోళ్లకు బంధించిన సీసీఐ కొత్తగా తీసుకొచ్చిన కపాస్ కిసాన్ యాప్ గురించి జిల్లా రైతులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ విజయేందిర అన్నారు. వ్యవసాయ మార్కెట్ శాఖకు సబంధించిన వరిధాన్యం, పత్తి కొనుగోళ్ల మద్దతు ధర పోస్టర్‌ను కలెక్టరేట్‌లో విడుదల చేశారు. పత్తి కొనుగోళ్లలో కొత్తయాప్ విధానం ద్వారా మిల్లుల వద్ద పత్తి రైతులకు నిరీక్షించే పరిస్థితి ఉండదన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మధుసూదన్ నాయక్, డీఆర్‌డీఓ నర్సింహులు, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, మార్కెటింగ్ శాఖ అధికారి బాలమణి, సివిల్ సప్‌లైయి డీఎం రవినాయక్, డీఎస్ఓ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

సకాలంలో సీపీఆర్ చేయాలి

అడ్డాకుల: గుండెపోటుకు గురైన వారికి సకాలంలో సీపీఆర్ చేస్తే వారిని ప్రాణాలతో కాపాడే అవకాశం ఉంటుందని సీపీఆర్ మాస్టర్ ట్రెయినర్, జానంపేట పీహెచ్‌సీ వైద్యురాలు షబానాబేగం అన్నారు. అడ్డాకుల మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఆది కర్మయోగి అభియాన్ ఆధ్వర్యంలో సీపీఆర్ చేసే విధానం గురించి వైద్య సిబ్బంది, రెవెన్యూ, మండల పరిషత్ ఉద్యోగులకు అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురై శ్వాస ఆగిపోయిన వారికి సీపీఆర్ చేయాలని సూచించారు. శ్వాస ఆడితే సీపీఆర్ చేయవద్దన్నారు. సీపీఆర్ చేయాల్సి వస్తే నిముషానికి వంద సార్లు ఛాతి మధ్య భాగంలో ప్రెస్ చేయాలని చెప్పారు. శ్వాస ఆడటం మొదలైతే వెంటనే దాన్ని నిలిపేసి ఆస్పత్రికి తరలించాలని సూచించారు. నీటిలో మునిగిపోయిన వారికి, రోడ్డు ప్రమాదాలకు గురైన వారికి ఏ విధంగా సీపీఆర్ చేయాలనే దానిపై ఉద్యోగులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్, ఎంపీడీఓ సద్గుణ, సీహెచ్‌ఓ షబ్బీర్, డాక్టర్లు వీరస్వామి, ప్రవళిక, అయేషా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అడ్డాకులలో సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ షబానాబేగం

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించాలి

గండేడ్: విద్యార్థుల్లో ఆధునీకతకు అనుగుణంగా సృజనాత్మకత పెంపొందించే విధంగా విద్యాబోధన చేయాలని గండేడ్ మండల విద్యాధికారి జనార్దన్ పేర్కొన్నారు. ఏబుక్ ఆఫ్ డిజిటల్ లర్నింగ్ కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి గండేడ్ మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసే గణిత, భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో మూడు రోజుల పాటు శిక్షణ ఇచ్చారు. బుధవారం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలని ఆయన పేర్కొన్నారు. శిక్షణలో ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు అవగతం చేయాలన్నారు. డీకోడింగ్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, ఫిజికల్ కంప్యూటరింగ్, డేటా సైన్స్ పైతన లాంగ్వేజ్ తదితర వాటిపై విద్యార్థులకు అన్ని పాఠశాలలో అవగాహన కల్పించాలని ఎంఈఓ జనార్దన్ పేర్కొన్నారు. ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థులకు వీటిపై అవగాహన కలిగిస్తే రానున్న రోజుల్లో ఉన్నత విద్యాభ్యాసానికి సులభ తరమవుతుందన్నారు. కార్యక్రమంలో మండల రోసోర్స్ పర్సన్స్ జనార్దన్, కొండయ్య ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



గండేడ్‌లో మాట్లాడుతున్న ఎంఈఓ జనార్దన్

గాలికుంటు వ్యాధి కట్టడికి టీకా ఒక్కటే పరిష్కారం

దేవరకద్ర రూరల్: పశువులలో సోకే ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధి కట్టడికి టీకా ఒక్కటే పరిష్కారం అని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మధుసూదన్ గౌడ్ అన్నారు. బుధవారం బస్వాయపల్లిలో 7వ విడత మెగా హెల్త్ క్యాంపును నిర్వహించారు. గాలికుంటు వ్యాధి సోకితే పాల ఉత్పత్తి తగ్గి పాడి రైతులకు ఆర్థిక నష్టం కలుగుతుందన్నారు. నిర్లక్ష్యం చేస్తే పశువులు చనిపోతాయని, వ్యాధి నిరోధక టీకా వల్ల వీటి నుంచి బయటపడే అవకాశం ఉందన్నారు. క్యాంపులో మొత్తం 567 పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసి, అవసరమైన మందులను పాడి రైతులకు అందించినట్లు పశువైద్య అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ మమత, వెంకటేశ్వర్లు, పశువైద్యాధికారులు ప్రవీణ్, జీషాన్ అలీ, ఎంపీడీఓ శ్రీనివాస్, డీటీ దీపిక, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి పాల్గొన్నారు.



టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి మధుసూదన్

గాలికుంటు టీకాలు వేయించండి

గండేడ్: గ్రామాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి సోకుతుందని రైతులు స్పందించి టీకాలు వేయించాలని పశువైద్యాధికారి నరేందర్ పేర్కొన్నారు. కొంరెడ్డిపల్లిలో పశువైద్య శిబిరం నిర్వహించారు.

277 పశువులకు టీకాలు

భూత్పూర్: మండలంలోని వివిధ గ్రామాల్లో 277 పశువులకు టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి డా.మధుసూదన్ తెలిపారు. 84 ఆవులు, 193 గేదెలకు టీకాలు వేసినట్లు ఆయన కోరారు.

కలగానే డబుల్ బెడ్రూంలు!

- నిర్మాణం పూర్తయినా మూడేళ్లుగా వృథాగా ఇళ్లు
- అసంపూర్తి ఇళ్లు.. ఆగమ్యగోచరం



నవాబుపేటలో అసంపూర్తిగా డబుల్ బెడ్రూంలు

నవాబుపేట: గత ప్రభుత్వ హయాంలో ఇళ్లు లేని వారికి అందించేలా డబుల్ బెడ్రూంల నిర్మాణం చేపట్టారు. వాటిని మండల కేంద్రంతో పాటు యన్మన్‌గండ్ల, తీగలపల్లి, రుద్రారం గ్రామాల్లో నిర్మాణం చేశారు. తీగలపల్లిలో 24 ఇళ్లు, రుద్రారంలో 24 ఇళ్లు, యన్మన్‌గండ్లలో 48 ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. రుద్రారంలో లబ్ధిదారులకు ఇళ్లను అందించినా యన్మన్‌గండ్ల, తీగలపల్లి గ్రామాల్లో నిర్మాణం పూర్తి చేసినా వాటిని లబ్ధిదారులకు అందించక పోవటంలో నిర్లక్ష్యం చేశారు. దీంతో అవి నేటికి మూడేళ్లుగా వృథాగా ఉన్నాయి. మండల కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో 100 ఇళ్ల నిర్మాణం చేపట్టింది. వాటిలో డబుల్ ఇళ్లు 24 పూర్తి కావచ్చినా మిగతా ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగా మిగిలిపోయింది. దీంతో ఇక్కడ ఇళ్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది. తాజా ప్రభుత్వం వీటి జోలికి రాకపోవటంతో అసంపూర్తి ఇళ్ల నిర్మాణం అటకెక్కింది. దీంతో కట్టిన ఇళ్లు శిథిలావస్థకు చేరుకుంటుండగా అసంపూర్తి వాటి పరిస్థితి మరింత దారుణంగా మారింది. దీంతో కోట్లాది రూపాయలు వృథాగా పోయో పరిస్థితి దాపురించింది. అందుకే వెంటనే అధికారులు ఆలోచించి వీటిని ఇళ్లు లేని నిరుపేదలకు అందించాల్సిన అవసరం ఉంది.



యన్మన్‌గండ్లలో వృథాగా ఉన్న డబుల్ బెడ్రంలు


త్వరగా అందించాలి..



గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వాటిని నిర్మించే స్థోమత లేనివారు, ఇల్లు మంజూరైన స్థలం లేక ఇంటి నిర్మాణం చేయలేని వారు చాలా మంది ఉన్నారు. పైగా గ్రామాలకు సైతం విడతల వారీగా ఇళ్లు వస్తున్నాయి. దీంతో సొంతింటి కోసం ఎదురు చూస్తున్న వారు చాలా ఉన్నారు. ఈ తరుణంలో ఎలాంటి ఆదెరువు లేక ఇంటి నిర్మాణం సైతం చేసుకునే పరిస్థితి లేని వారికి డబుల్ బెడ్రూంలు అందించి వారి సొంతింటి కల నెరవేర్చాలి.

– హన్మంతునాయక్ (యన్మన్‌గండ్ల)

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం..



డబుల్ బెడ్రూం విషయంలో ఎలాంటి ఆదేశాలు అందలేదు. పైగా అసంపూర్తి ఇళ్లకు సంబంధించి బడ్జెట్‌కు సంబంధించిన అంశం కావటంతో ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. డబుల్ ఇళ్ల వ్యవహారం గతంలో రెవెన్యూ శాఖ పరిధిలో ఉండేది. తాజాగా ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభం కావటంతో ఏఈని నియమించి ఎంపీడీఓ పరిధిలో ఉంచారు. యన్మన్‌గండ్ల, తీగలపల్లి గ్రామాల్లో పూర్తి చేసిన డబుల్ ఇళ్లు లబ్ధిదారులకు ఇవాల్సిన విషయంలో జిల్లా అధికారులకు వివరిస్తాం. వారి ఆదేశాలు వస్తే వాటిని అమలు చేసేలా చూస్తాం.

– జయరాంనాయక్, ఎంపీడీఓ